**ప్రియుని రాకకోసం అలంకరించుకుని యెదురుచూసే నాయికను వాసవ సజ్జిక అంటారు. ఈ వాసవ సజ్జికకు యెవరు కావాలో?**

# "శాంతా నీ కోసం ఎవరో వచ్చారమ్మా" అంటూ అమ్మకంఠం బయట సావిట్లోంచి వినిపించింది.

వెంకటేశ్వరస్వామి పటం దగ్గర నిలబడ్డ శాంత ఒక్కసారి ఉలిక్కిపడి 'వస్తున్నా' అని సమాధానం చెప్పింది కాని, అక్కడనుంచి కదల్లేదు.

'తనకోసం ఎవరో వచ్చారు! తన కోసం ఎవరో వచ్చారు.' ఇవే మాటలు మనస్సున ఆలాపనగా మసలాయి.... ఆనందంతో హృదయం వెర్రి పరుగులు తీసింది.

నిజానికి అమ్మ ఎంతో అమాయిక రాలు. ఆవిడ మాటలు ఎప్పుడూ యిల్లాగే వుంటాయి. తన మనస్సును దోచిన మొన గాడు యీనాడు తను యింటికి వస్తే, అమ్మ అజ్ఞానంగా-

"నీ కోసం ఎవరో వచ్చారమ్మా" అనిఅంటుంది. కాని, అమ్మ మాట నిజమే. తన మనస్సులోని మాట అమ్మకు యేనాడు చెప్పలేదుగా!

తన మాట మన్నించి అతను వచ్చాడు. అదేచాలు పదివేలు. ఇంతకన్నా తనకేం అక్కరేదు.

"శాంతా!" అంటూ అమ్మ కంఠం యింకొకసారి పలికింది. ఈ సారి శాంత బదులు పలకలేదు. అద్దానికి రవ్వంత దగ్గరగా వెళ్ళి నిలబడింది. ప్రొద్దున్నే తలంటి పోసుకుందేమో ముంగురులు గాలికి రెప రెపలాడుతున్నాయి. బంగారు ఛాయ ముఖం చామంతి వన్నెకు వచ్చింది. ఎర్ర రంగు బార్డరు తెల్లసిల్కుచీరె వంటి పసి మికి తాను కూడా రవ్వంత పసిమి పొందింది. చక్కటి ముఖం. ఎర్రటి పెది మలు. నిండైన విగ్రహం- అద్దంలో మనిషి యెంత అందంగా వుంది!

ఆ మనిషి తనేనని తెలియగానే యెంత గర్వం కలిగింది!!

పారాణి పాదాలమీద నీరెండ దోబూచు లాడుతోంది.

శాంత అందగత్తె!

"శాంత కాలేజీబ్యూటీ." తనకువినబడే లాగా అందరు అంటూ వుంటారు.

ఆ మాటలు వింటూవుంటే తనకు భూమిమీద పాదం నిలవదు.

మనస్సు మల్లెకన్నా తేలిక అవుతుంది.

అడ్రసు చెప్పని అజ్ఞాతప్రియుడు ఒకనాడు తనమీద పెద్ద పాట రాసి పంపించాడు.

చిన్నారి నీ సొగసే
వెన్నెలల్లిన చాందిని
వయ్యారి నీ వలపే
మరు మల్లెలు
విరబూసిన ఘుమ ఘుమ పందిరి!!

వెన్నెలల్లిన చాందిని! ఎంత చక్కటి ప్రయోగం. తెనుగు భాషని యింత మధురంగా వాడిన ఆ చిన్నవాడెవరో చూద్దామని- కనబడితే - పరిచయం కలిగితే అతనిని అభినందిదామని అనుకుంది.

ఇంకొక అనామకుడు తనకు ఉత్తరం రాస్తూ-'రాగమయీ! అనురాగమయీ!' అంటూ సంబోధించాడు. తరువాత సాహిత్యం- సెన్సార్‌వాళ్ళు కూడా చదవటానికి వీలులేనంత భయంకరంగా రాశాడు.

ఎవరై వుంటారని- తన క్లాసులోని మగ పురుగులని అందరిని ఆనాడు పరకాయించి చూసింది.

ఇంకొక విరహ ప్రియుడు నిండు పున్నమినాడు తనకు అందేలాగా సెంటు వాసనల ఉత్తరం రాశాడు.

బహుశః స్పెషల్ తెలుగు కుర్రవాడేమో.

సుధవోలే సుహాసిని
మధువోలే విలాసిని
కుహూ! కమిలి.
సరసం సరాగమే
రావే వరాల బాల!

అతగాడి గోత్రనామాలు ఈ నాటికి తనకు తెలియవు!


నిజమే! అందరికీ తననిచూస్తే ఆనందమే. అనురాగమే: కాని యెందరు మెచ్చితే మాత్రం ఏం లాభం!

ఆ ఋష్యశృంగుడు కన్నెత్తి చూస్తేనా! — ఒక విధంగా అల్లసాని పెద్దనగారి ప్రవరుడు.

"ఎవ్వతె వీవు భీత హరిణేక్షణ" అంటూ అడ్రసు అడిగాడు.

కొందరు ఎందుకు పుడతారో తనకు తెలియదు. అసలే అర్ధంకాదు — కనీసం వాళ్ళకైనా తెలుసో తెలియదో!!

ఈ కుర్రవాళ్ళ మాటకేం-శతమర్కటాలు. కొంతమంది లెక్చెరర్లకి కూడా



తనని నమిలి మింగి వేద్దామన్నంత ఆవేశం. ఆకలి.

వాళ్ళ వెకిలి చేష్టలు చూస్తూవుంటే — ఐనా యీ బ్రహ్మదేముడు యీ మగ జాతిని ఎందుకు పుట్టిస్తాడో కదా అని అనిపిస్తుంది. ఇటువంటి పొరబాటు పని చేశాడు కాబట్టే- అల్లా పూజా పునస్కారాలు లేకుండా మూలబడిపోయాడు.

ఎవరేమనుకుంటే తనకేం!

ఏడ్చేవాళ్ళని ఏడవనీ!

నవ్వేవాళ్ళని నవ్వనీ!!

అతను వచ్చాడు! తను పిలవగానే వచ్చాడు.

అమ్మ నిన్ననే అన్నది "మా చిట్టితల్లికి రేపటితో పద్దెనిమిది నిండుతాయి!"

ఈ రోజున ప్రొద్దున కూడా ఆమాటే అన్నది.

తనకి పెదపెద్దన నవ్వు వచ్చింది....

"ఆ మాటే రెండేళ్ళబట్టీ అంటున్నావమ్మా" అని తను అన్నది.

"ఎన్ని సంవత్సరాలైనా నువ్వు నా కంటికి పసిపిల్లలాగానే కనిపిస్తావు." అని అమ్మ అన్నది.

"అదే నీతోవచ్చిన చిక్కు" అని తను అన్నది.

"నిన్ను ఒక అయ్యచేతిలో పెడితేనే కాని నా చిక్కు నీకు తీరదు" అని అమ్మ నవ్వుతూ అన్నది.

తనేం మాట్లాడలేదు. అయినా ఏం మాట్లాడుతుంది! ఎవరో ఒక అయ్య చేతిలో పెడితే తను వూరుకుంటుందా!

తన మనస్సులో నిలచిన ఆ మన్మథ మూర్తి ముందరే తను మోకరిల్లాలి. ఛీఛీ! ఇన్నాళ్ళ యిటువంటి ఆలోచనలు వస్తున్నా యేమిటి? "ఏం ప్రేమించడం తప్పా!"

అయినా కొందరి తత్వం తనకు ఎంత మాత్రం అర్థం కాదు. అంత మంచివాడు అందరిచేత అనిపించుకోగల ఆ వ్యక్తికి ఆ రౌడీ వెధవ! ఆ గోపాలంగాడితో స్నేహం ఏమిటో!

మిడిగుడ్లు, బుర్రమీసాలూ, వాడూ, కసాయివాడిలాగా కనిపిస్తాడు. అన్నింటి కంటే-తనకు వళ్ళు మండేది. వెధవ యికిలింపూ వాడూను.

అమ్మాయిలకి వాడంటే అసహ్యం! లెక్చరర్లకి వాడంటే భయం! తన విషయంలో మాత్రం జాగ్రత్తగానే వుంటాడు. ఎప్పుడూ అమర్యాదగా ప్రవర్తించలేదు కాని....

చంద్రదంచుట్టూ యెప్పుడు రాహువులాగా వదలకుండా తిరుగుతూ వుంటాడు. చంద్రంతో క్షణకాలం ఏంటరిగా మాట్లాడాలంటే తనకు అవకాశం దొర




# వాసకసజ్జిక

మల్లాది సూరిబాబు

# మల్లెపందిరి

## బెదిరిన మనసులు

తెనాలి రాముడొకసారి మరుగుతున్న పాలు పిల్లికి తాగించాడు. మూతి కాలిన ఆ పిల్లికి ఇంక పాలంటే భయం పట్టుకుంది.

దుర్జన దూషిత మనసాం సుజనేఽపి నాస్తి విశ్వాసః।
బాలః పాయస దగ్ధో దధ్యపి ఫూత్కృత్య భక్షయతి ।।

ఒక చెడ్డవాడి ద్రోహంతో విరిగిన మనసుగల వారికి మంచివాళ్ళమీద కూడా విశ్వాసం ఉండదు. పిల్లవాడు పరమాన్నం తిన్నప్పుడు మూతికాలడంచేత పెరుగును కూడా ఉఫ్ ఉఫ్ అని ఊది చల్లార్చుకుని తింటున్నాడు.

—సౌభరి

కటంలేదు. నిన్నటికి నిన్న చంద్రం లైబ్రరిలో వుండగా తను వెళ్ళింది. రాహువు దగరలేదు కదా మనస్సువిప్పి రెండు మాటలు మాట్లాడదామని తను చంద్రం బల్ల దగ్గరకు వెళ్ళి కూర్చుంది.

చంద్రం తనని చూడగానే యెన్నడూ చెయ్యని పని చేశాడు. తన వంకచూసి చిరునవ్వు నవ్వాడు.

తను "థాంక్యూ" అని అన్నది.

అతను "కూర్చోండి" అని అన్నాడు.

తను కూర్చుంది. "రేపు నా పుట్టిన రోజు" అని అన్నది.

అతనేం మాట్లాడలేదు.

"రేపు మా యింట్లో చిన్న పార్టీ యిస్తున్నాను, రేపు మధ్యాహ్నం మా యింటికి మీరు భోజనానికి రావాలి" అని అన్నది.

"రేపు...." అంటూ అతనేదో చెప్పబోయాడు.

"రేపు కాలేజీకి సెలవ్ కదా.... అభ్యంతరం చెప్పకండి" అని అంటూవుంటే యెక్కడనుంచి వచ్చాడో యేమో-మిడిగుడ్లు వేసుకుని ఆ గోపాలం వచ్చాడు. తమ యిద్దరిని చూడనట్టుగానే బల్లదగ్గర కూర్చొని ఏదో రాసుకోవడం మొదలు పెట్టాడు.

తను అక్కడ యిహ వొక్క క్షణం కూడా నిలబడలేకపోయింది.

"తప్పక వస్తారు కదూ" అంటూ చంద్రంతో అని అక్కడనుంచి వచ్చేసింది.

"శాంతా!" అంటూ అమ్మ మళ్ళీ పిలిచింది.

అద్దంలో యింకొకసారి తనని తాను చూసుకుంది. ఇంటికి రమ్మని అయితే పిలిచింది కాని, తీరా అతను వచ్చేసరికి చెప్పలేనంత సిగ్గు వేస్తోంది.

తనని గురించి అతనేమనుకున్నాడో!!

ఏమనుకుంటే తనకేం-తను పిలిచింది. అతను వచ్చాడు. అరమరిక లేకుండా ఈనాడు ఎన్నో విషయాలు అతనితో చెప్పాలి. ముఖ్యంగా గోపాలంగాడి స్నేహం మానేయమని మరీమరీ చెప్పాలి.

సావిట్లోకి వచ్చేసరికి, అతను సోఫాలో కూర్చొని పేపరు చదువుతున్నాడు.

తను గుమ్మంలోనే ఆగిపోయింది.

సోఫాలో గోపాలం కూర్చొనివున్నాడు.

తనకు వళ్ళు మండిపోయింది.

"ఎందుకు వచ్చారు మా యింటికి" అని అడిగింది.

గోపాలం ఉలిక్కిపడి ఇటువంక చూశాడు.

"హాపీ బర్త్ డే టు యు.... జన్మదిన శుభాకాంక్షలు" అని అన్నాడు.

"నేను మిమ్మల్ని మా యింటికి రమ్మని పిలిచానా?"

"పిలవని పేరంటానికి!.... నేను వచ్చింది."

"మీరు వచ్చింది ఎందుకో నాకు తెలును గాని, దయచేసివెళ్ళండి." అతని ముఖంలో చిరునవ్వు కనిపించింది. "అభ్యాగతః స్వయం విష్ణువు అని అన్నారు."

"దేవభాషనిఎందుకుపాడుచేసారు కాని. ఇహ వెళ్ళరండి" అంటూ తను వెనక్కి తిరిగింది.

అతనేం మాట్లాడలేదు. "గుడ్ బై" అంటూ వెళ్ళిపోయాడు. లోపలికి వెడుతూ వుంటే కాఫీ కప్పుతో అమ్మ ఎదురయింది.


"అతనేడి?" అని అడిగింది.


"వెళ్ళగొట్టేశాను" అని శాంత అన్నది.

ఆవిడ ఒక్క క్షణం శాంత వంక చూసింది.

"కూర్చో శాంతా.... నీతో ఒక్కమాట చెప్పాలి."

"నీతిచంద్రిక- హితోపదేశం మొదలు పెడతావా?" అని శాంత చిరాకుగా అడి






"ఎవరు ఏ ఉపదేశం చేసినా నేను వున్నంత కాలమేనమ్మా.... ఆ తరువాత నీ అజ యెవరికి కావాలి."

"ఎవరికి కావాలో నువ్వే చెప్పు!"

"కట్టుకున్నవాడికి కావాలి, కడుపున పుట్టిన వాళ్ళకు కావాలి."

"సోమలింగం" అని శాంత వెటకారంగా అంది.

"ఇప్పుడు నవ్వులాటగానే వుంటుంది శాంతా. రోజులు గడిస్తే నీకే అర్థం అవుతుంది."

"ఏ మర్థమవుతుంది."

"ఆడదాని అందం చూసి మొగవాడు మోహించవచ్చు. కాని ఆడదానిలోని మంచితనాన్ని చూసే అతనుపూజించేది"

"నన్నే మొగవాడు పూజించనక్కర" లేదు.

"పూజించనక్కర్లేదు. పువ్వుల్లో పెట్టి చూచుకోవా లనిపిస్తోంది."

"ఇంతకూ ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకో చెప్పు."

"ఏమీలేదు. గుమ్మంలోకి వచ్చిన మనిషిని అలా దులపరించుకుని పంపించి వేశావు. చదువుకున్నదానివి- అన్నీ తెలిసిన దానివి- ఇదేమన్నా బాగుందా?"

"ఈ మగవాళ్ళ సంగతి నీకు తెలియదమ్మా.... మెల్లిగా ఏదో నెపం మీద మనల్ని పలుకరించడం, అక్కడనుంచి కాలేజీలో నానాగోల. ప్రతివాడు తనొక రోమియోనని అనుకుంటాడు. వీళ్ళని చూడగానే ఆడపిల్లలు మూర్ఛపోయి వీళ్ళ పాదాలమీద పడతారని వీళ్ళ ఉదేశం. ఐనా ఈ ఆడపిల్లలకికూడా బుద్ధిలేదులెదు! అన్నీ తెలిసే వీళ్ళు వాళ్ళ వలలో పడటం. అక్కడనుంచి ఎక్కడలేని విరహతాపాలు, గరల్స్ వెయిటింగ్ రూమ్‌లో ఒక్కక్షణం కూర్చుంటె ఇదే రభసకదా!"

"నీ మాటలేంనాకుఅర్థంకావటంలేదు."

"అర్థం కావులే"

"మగవాళ్ళంటె అంత కోపం వున్న దానివి, ఆ చంద్రం అంటేఎందుకు అలా విలవిలలాడిపోతావు?"

శాంత ఒక్కసారి గతుక్కుమన్నది "చంద్రమా! చంద్రం సంగతి నీకెలా తెలుసు?"

"అర్థరాత్రి పూట కలవరిస్తూవుంటే తెలియక ఏం చేస్తుంది."

"కలవరిస్తున్నానా? అన్నీ అబద్ధాలు."

"కలవరించటంలేదు. పోని స్మరణ చేస్తున్నావు."

"చంద్రం అందరిలాంటివాడు కాదు అమ్మా. ఎంతో తెలివి కలవాడు. క్లాసులో ఎప్పుడూ ఫస్టేకదా! ఆడపిల్లలవంక కన్నెత్తి కూడా చూడడు. పది మాటలు మాట్లాడితే ఒక్కమాట సమాధానం చెబుతాడు."

"పరాయివాడితో నీకు మాటలేమిటె?" అని అమ్మ అడిగింది.

"నీకు తెలియదమ్మా! చంద్రంపరాయివాడా? పోనీ పరాయివాడు కాకపోతే ఏ రకం చుట్టం? ఇవ్వాళ్ళ భోజనానికి వస్తాడుగా అప్పుడే అడుగుదువుకాని."

"భోజనానికి పిలిచావా? నాతో చెప్పలేదే?"

"నీతో ముందుగా చెబితే - అనవసర

# మా పాఠకులకు మనవి

పత్రికా ప్రచురణకు అవసరమైన న్యూస్ ప్రింటు, ఇతర ముడి ఫిలిం వస్తువుల ధరలు పెరిగినందున సెప్టెంబరు 19వ తేదీని వెలువడే 'వినాయక చవితి' సంచికనుంచి ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక విడిప్రతి వెల ఒక రూపాయికి పెంచవలసిన పరిస్థితి తప్పనిసరిగా ఏర్పడింది.

కొత్త రేట్ల ప్రకారం చందా వివరములు

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

## విడిప్రతి : ఒక రూపాయి

| | ఏజెంటు ద్వారా | పోస్టు ద్వారా |
|---|---|---|
| మూడు నెలలకు | 13.00 | 13.65 |
| ఆరు నెలలకు | 26.00 | 27.30 |
| పన్నెండు నెలలకు | 52.00 | 54.60 |

పత్రిక నిర్వహణ వ్యయం ఎంతగానో పెరిగినప్పటికీ అందులో కొంత మేరకు మాత్రమే పాఠకులు భరించవలసివచ్చినందుకు సహృదయతతో పరిస్థితులను అర్థం చేసుకొని మాతో సహకరించవలసిందిగా మా అభిమానులను కోరుతున్నాము.

బిజినెస్ మేనేజర్, ఆంధ్రజ్యోతి.

N. B. : 19-9-1980 తేదీకి పూర్వపు పోస్టల్ చందాల గడువు కొత్త రేట్ల ప్రకారం సరిచూడబడును.

మైన హైరానపడి పది రకాల వంటలు చేస్తావని చెప్పలేదు."

"నీ తెలివి తెల్లారినట్టే వుందిలే" అంటూ అమ్మ లోపలికి వెళ్ళింది.

"శాంతా! శాంతా!" అంటూ బయట నుంచి సుగుణ కంఠం వినిపించింది. క్లాసు మేట్ కంఠం వినబడగానే శాంత కంగారు పడుతూ లేచింది.. సుగుణ తనతో మాట్లాడుతూ వుండగా చంద్రం తమ యింటికి వస్తే ఇంకేమన్నా వుందా!

ఇది వూరూరా చాటించదూ.... ఏదో విధంగా దీన్ని వెంటనే పంపించివెయ్యాలి.

"రా సుగుణా!" అంటూ గుమ్మందాకా వచ్చింది.

"నీతో పోట్లాడదామని వచ్చాను. హేపీ బర్త్‌డే" అని అంది.

"నీకెట్లా తెలుసు!" అని ఆశ్చర్యంగా అడిగింది.

"ఉదయం ప్రాంతీయ వార్తలలో చెప్పారుగా."

"ఏమని?"

"బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ఈశాన్య దిక్కుగా ప్రయాణం చేస్తోంది. చెదురు మదురు జల్లుల దగ్గర నుంచి భారీ వర్షందాకా, కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పడవచ్చునని-

వాన మబ్బులేని ప్రాంతాలలో గాలి పొడిగా వుంటుందని—

మనవూళ్ళో కుమారి శాంతగారిజన్మదినం ఘనంగా జరుపుకుంటున్నారని...."

"నేనేం ఘనంగాజరుపుకోవటంలేదు."

"ఆ విషయం నాకుతెలుస్తూనే వుందిలే. గుమ్మంలోనే నుంచో పెట్టి మాట్లాడుతున్నావు! ఐనా నాకెందుకులే అమ్మ. పానకంలో పుడకని, చెవులోని జోరీగని, చెప్పులోని రాయిని."

"ఇంతేనా యింకేమన్నావుందా?" అంటూ శాంత చిరాకుగా "లోపలికి రా...." అంది.

"ఇప్పుడు కాదులే.... సాయంకాలం వస్తాను, సినిమాకి వెడదాం రెడీగా వుండు. ఈలోగా ఈనాటి ముఖ్య అతిథి సేవా సత్కారం యధావిధిగా జరుపుకో."

"ముఖ్య అతిథా! ఆయనెవరు?"

"దొంగ దొరికింది. అతిథి-ఆయనఅని తేలింది. సంతోషం" అంటూసుగుణ పెద్ద పెట్టున నవ్వింది.

"ఎవరే వచ్చింది" అంటూ శాంతి వాళ్ళమ్మ బయటకు వచ్చింది. సుగుణని చూడగానే సంతోషంతో "ఏమే అమ్మడు.

KANTA CHAP

యువతరాన్ని ఉర్రూతలూగించే ప్యాషన్లలో బోంబే డయింగ్‌వారి సరిక్రొత్త ఉత్పత్తి సుల్‌జోన్ టెక్స్‌రైజ్‌డ్ × టెక్స్‌రైజ్‌డ్ సూటింగ్స్‌లకు, షర్టింగ్సులకు దయచేయండి.

బోంబే డయింగ్ షోరూం,

'శ్రీ లక్ష్మి', యం.జి. రోడ్, కొత్తగూడెం.



శుభవార్త

నాడీ ప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు

డా॥ ఎన్. ఎస్.రావు, M.B.H.R.M.P

గారిని సంప్రదించండి.

రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,

ప్లాట్ నెం. 471, మాదాపురం రోడ్‌లో జూబిహిల్సు కో- ఆపరేటివ్ సొసైటి బిల్డింగ్సు, బంజారాహిల్సు ఎక్స్‌టెన్‌షన్.

హైదరాబాద్-500 034 (నాంపలి నుండి బస్సు రూట్ 9V)

శరీర బలహీనత, పూబగా పెరుగుటగాని, చిన్నప్పటినుండి ఏ మందువలన లావు కాకపోవుట, అంగములు వుండవలసిన సైజులో వుండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండెదడ, రక్తప్రసరణ ఎక్కువగావడం లేక తక్కువ గావడం, సర్వవిధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తికడుపు ఎత్తుగా పెరగడం, జలోదరం, కడుపునొప్పి, గ్యాస్టిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలిచేరుట, స్త్రీల ముట్టు కట్టునొప్పి, కసుమవ్యాధి (ఏ రంగైనా సరే), మూత్రవ్యాధులు, మూలశంఖ, సుఖవ్యాధులు, స్త్రీలకుగాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపునొప్పి, నడుము నొప్పి, కీళ్ళ వ్యాధులు, వాపు, నీరు చేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బొదవాపు, జ్వరం, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా పరిణమించినపుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలం : ఉ. 7 గం. నుండి సా. 5 గం. వరకు
పరీక్ష ఫీజు రు. 15/- చికిత్సకు అదనం.

ప్రతినెల క్యాంపులు : 5వ తేదీ కర్నూలు- న్యూ ఉడిపి హోటల్, పెద్ద మార్కెట్‌వద్ద, 6వ తేదీ గుంతకల్- శ్రీలాడ్జి; 7వ తేదీ కడప- ద్వారకాలాడ్జి; 8వ తేదీ తిరుపతి- భీమాస్ అనెక్స్ లాడ్జి; 9, 10 తేదీలు మద్రాస్- కోమల విలాస్, నెం. 1 ఫ్రాన్స్ జోసఫ్‌స్ట్రీట్ (జి. టి.) హైకోర్టు ఎదురుగా: 11వ తేదీ నెల్లూరు- రాఘవ విహార్: 12వ తేదీ గుంటూరు- ఉడిపి శ్రీకృష్ణభవన్, స్టేషన్‌రోడ్; 13, 14 తేదీల రాజమండ్రి- శాంతినివాస్ (మెయిన్ రోడ్); 15, 16 తేదీలలో వైజాగ్- బృందావన్ లాడ్జి, డాబాగార్డెన్స్; 17వ తేదీ విజయవాడ- మోడరన్ కేఫ్ లాడ్జి (గాంధీనగర్); 18వ తేదీ ఖమ్మం- మయూర్ కేఫ్, (శేషమహల్ లాడ్జి); 19వ తేదీ వరంగల్-హోటల్ నటరాజ; 20వ తేదీ నుంచి హెడ్డాఫీస్.

N.B : పోస్టుద్వారా సలహా కోరువారు ఫీజు రు. 15/- జవాబుకు పోస్టు బిళ్ళలు పంపవలెను

SWASTIK

# ఎక్కడ?

రచన : రవీంద్ర గురుదేవులు

శ్మశానంలో కర్మకాండ ముగించి తండ్రి ఇంటికి వచ్చాడు.
ఏడేళ్ళకొడుకు కిటికీదగ్గర నిలబడి చూస్తున్నాడు
బంగారపు తాయెత్తు మెళ్ళో వేలాడుతున్నది
విశాల నయనాలలో వయసుకు మించిన ఆలోచనలు మెరుస్తున్నాయి.
కొడుకును దగ్గరికి తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు తండ్రి. "అమ్మ ఏదీ?" అన్నాడు కుర్రాడు.
ఆకాశంవంక చూపిస్తూ "అదుగో అక్కడ.... స్వర్గంలో వుంది" అన్నాడు తండ్రి.
ఆ రాత్రి తండ్రికి నిద్రపట్టలేదు. బరువెక్కిన హృదయంతో మంచంమీద దొర్లుతున్నాడు.
మిణుకు మిణుకు మంటున్నది గది గడపదగ్గర దీపం.
గోడమీద బల్లి పురుగులకోసం వేటాడుతున్నది.
కుర్రవాడు ఉలిక్కిపడి లేచాడు. అమ్మ పక్కన వుందేమోనని తడుముకున్నాడు.
మంచందిగి ఒక్కడే చీకట్లో మెట్లు ఎక్కి డాబామీదికి వెళ్ళాడు
ఆకాశంలోకి చూపులు ప్రసరిస్తూ ఎంతోసేపు నిశ్శబ్దంగా నిలబడ్డాడు.
ఆ పసి మనస్సులోంచి "స్వర్గం ఎక్కడుంది?" అనే ప్రశ్న ఎగసివచ్చి గగనమంతా వెదుకుతూ తిరిగింది.
ఆ ప్రశ్నకు సమాధానం దొరకలేదు.
ఆ నిశీథంలో నిబిడమైన అంధకారం అమ్మకోసం
రాల్చే వెచ్చని
అశ్రువులై తోచాయి నక్షత్రాలు.

(తెలుగు — అమరేంద్ర)

బొత్తిగా నల్లపూసైపోయావు. ఇటుకేసి రావడమే మానేశావు. ఈ పూట అమ్మాయి పుట్టిన రోజు మన యింట్లో భోజనం చేసి వెళ్ళు" అని ఆహ్వానించింది.

శాంత ఏం మాట్లాడలేదు.

సుగుణ పెద్ద పెట్టున నవ్వింది. "చెలిల స్నేహం శోభనందాకా!" ఇంకోసారి వస్తాలెండి పిన్నిగారు. వస్తా శాంతా. సాయంత్రం రెడీగా వుండు."

"రెడీగానేవుంటాగాని నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు."

"చిక్కు ప్రశ్నకు సమాధానం వచ్చేవారం సంచికలో చదవండి. పంచరంగుల టైటిల్ పేజీతో 64 పేజీలు. వెల ఒక రూపాయి మాత్రం. టాటా బై బై" అంటూ సుగుణ వెళ్ళిపోయింది.

అమ్మ వంటింట్లోకి వెళ్ళింది.

ఒంటరిగా శాంత - శాంతకు తోడుగా చిక్కు ప్రశ్న మిగిలింది.

సుగుణకి యీ విషయం ఎలా తెలిసింది? చంద్రం చెప్పాడా? గోపాలం చెప్పాడా? తను ఎంతో రహస్యంగా వుంచుదామనుకున్న విషయం ఎంత బట్ట బయలు అయింది. ఇంకేముంది రేపు యీ పాటికి కాలేజీ గోడల నిండా తాటికాయంత అక్షరాలతో రాయరు?

"శాంత యింటికి చంద్రాన్ని భోజనానికే పిలిచిందా?"

ఛీ! ఛీ! ఏం మనుష్యులు? ఏం లోకం? వీళ్ళని చూస్తే ఎంత అసహ్యం వేస్తుంది! బొత్తిగా ఓర్వలేని మనుష్యులు.. ఇప్పుడేం చెయ్యడం....

"అమ్మాయీ! అతనువచ్చాడా" అంటూ అమ్మ వచ్చింది

గుమ్మం వంక చూస్తూ "వస్తూ వుంటాడమ్మా" అని శాంత సమాధానం చెప్పింది.

గంట గంటకు అమ్మ ఆ ప్రశ్న వేస్తూనే వుంది. శాంత అదే సమాధానం చెబుతూనే వుంది.

చివరకు చల్లారిన ఉత్సాహంతో, చల్లారిన వంటకాలు ఆ తల్లీ కూతుళ్ళు ఇద్దరూ ఎంగిలిపడి లేచారు.

ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. చంద్రం ఎందుకు రాలేదు? తన పిలుపు నచ్చలేదా? రావడానికి మొహమాటపడ్డాడా! వస్తూంటే యాక్సిడెంట్ జరిగిందా!! అమ్మో! చంద్రానికి ఏం అపాయం జరగకూడదు చలగా వుండాలి. క్షణకాలంలో నే వెయ్యి దేముళ్ళకు మొక్కుకుంది.

ఛీ! ప్రొద్దున్నే లేచి ఎవరి ముఖం చూశానో? అన్నీ యిల్లాగే అవుతున్నాయి.. పిలవని పేరంటంగా వచ్చాడుగా ఆ గోపాలం! వాడి ముఖం చూశాను. అన్నీ నాశనం అయ్యాయి....

కాలు కాలిన పిల్లిలాగా యిల్లంతా తిరుగుతూనే వుంది.

సాయంకాలమయింది. చీకటి వచ్చింది.. కాని చందమామే రాలేదు.

చందమామ రాలేదు. కాని సుగుణ వచ్చింది.

"రాణీగారు ఇంకా యిల్లాగే వున్నారేం? అతిథిసత్కారంలో బాగా అలిసిపోయినట్టు వున్నారే" అని అంది.

"నోరు మూసుకో" అని శాంత అన్నది.

"నోరు మూసుకునే పడివుంటాగాని అమ్మాయిగారు త్వరగా తెమలండి. అవతల కాలం మనకోసం ఆగటంలేదు."

"నేను రాలేనే."

"నువ్వు రాకుండానేను వెళ్ళలేనే పిచ్చి తల్లీ! ప్లీజ్ గెట్ రెడీ...."

"వసానుగాని—నోక్వశ్చన్స్. ప్రశ్నలు వేసి నా ప్రాణం తీయొద్దు"

"ఓ.కె. నో క్వొశ్చన్.... అడగనులే.... త్వరగా తెములు."

వీళ్ళు వెళ్ళేసరికే సినిమా ప్రారంభం అయింది. చీకటిలో వెళ్ళి ఒకమూల కూర్చున్నారు.

సుగుణ సినిమాలో లీనమై చూస్తోంది.. తెరమీద ఈస్‌మన్ కలర్‌లో నాయికా నాయకులు యిద్దరు డ్రీమ్‌సీన్‌లో ఒకళ్ళ కొకళ్ళని హత్తుకుని-

'క్షణ క్షణం నిరీక్షణం' అంటూ తన్మయం అవుతున్నారు.

శాంత మనస్సులో మసలుతున్న ప్రశ్న. చంద్రం ఎందుకు రాలేదు?

కథా నాయికా నాయకుల కల కరిగించి వేస్తూ రంగంలోకి విలన్ ప్రవేశం. కొంచంసేపే. "డిష్యూం" డిష్యూం" అంటూ శబ్దాలు. భయంకరమైన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌తో డస్సిపోయిన ప్రేక్షకులకి విశ్రాంతి అవసరమని తెర మీద మూడు పెద్ద పెద్ద అక్షరాలు కనిపించాయి 'విశ్రాంతి'. చీకటిపోయి వెలుగు వచ్చింది! కాని ఆ వెలుగులో శాంత కళ్ళ ముందు యింకా పెద్ద చీకటి కమ్ముకుంది.

రెండు వరసల ముందరగా వాళ్ళు ముగ్గురు కనిపించారు చంద్రం! ఒక చామనచాయ రంగు పిల్ల. ప్రక్కన గోపాలం!

చంద్రం ఆ పిల్లతో యేమిటో చెబుతున్నాడు. ఆ పిల్ల ఆసక్తిగా వింటోంది.

సుగుణ అటువైపే చూసింది. శాంత ముఖంవంక చూసింది.

"చంద్రం మధ్యాహ్నం భోజనానికి రాలేదా?" అని అడిగింది.

శాంత సమాధానం చెప్పలేదు. "నేను ఇంటికి వెడుతున్నాను" అంటూ లేచింది.

"నేనుకూడా వస్తున్నా" అంటూ సుగుణ కూడా బయలుదేరింది. దారి పొడుగునా యిద్దరూ ఏం మాట్లాడుకోలేదు.

శాంతని ఇంటిదగ్గర దిగపెట్టి సుగుణ వెళ్ళిపోయింది.

"అప్పుడే వచ్చేశావేం?" అంటూ అమ్మ అడిగింది.


హ్యాండ్‌బ్యాగ్ సోఫాలోకి విసిరికొట్టి శాంత కూలబడింది.

"కాఫీ తెచ్చిపెట్టమ్మా" అని మాత్రం అన్నది.

సోఫాలోంచి క్రిందపడ్డ హ్యాండ్‌బ్యాగ్ తీసుకుందామని కిందకు వంగింది.

సోఫాకి, టీపాయికి మధ్య ఒక చిన్న గిఫ్ట్ ప్యాకెట్ పడివుంది.

"కుమారి శాంతకు జన్మదిన కానుక." అని రాసి వుంది. వణుకుతున్న చేతులతో



కొండవీటి ఖిల్లా — ఫొటో : టి. నరసింహారావు, పాత గుంటూరు

ఆ ప్యాకెట్ విప్పింది. ఉలిపిరి కాగితంతో, పొటంలో నల్లటి వెల్వెట్ మీద, పించం విప్పుకున్న నెమలి వెండిజరీ పనిచేసిన హ్యాండ్ బ్యాగ్.

హ్యాండ్ బ్యాగ్ తెరిచింది. మడత పెట్టిన కాగితం వుంది. చివర సంతకం చూసింది. 'చంద్రం' అని వుంది.

చంద్రం! చంద్రం!! చంద్రం!!!

మరి సినిమాలో ఆ అమ్మాయి ఎవరో! ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు, సందేహాలు మనస్సులో పెట్టుకుని ఉత్తరం చదవటం మొదలుపెట్టింది.

కుమారి శాంతగారికి-

నమస్కారములు. మీ జన్మదిన శుభ సమయాన నా తరపున, మన మిత్రులందరి తరపున మీకు మా శుభాకాంక్షలు తెలియపరుస్తున్నాను.

మీ యింటికి విందుకు పిలిచారు. వద్దామని అనుకున్నాను కాని, నన్ను ఒక్కడినే పిలిచారని తెలిసిన తరువాత నా నిర్ణయం మార్చుకున్నాను.

కారణం చెప్పవలసిన బాధ్యత నాకుంది. లేకపోతే మీరు నన్ను అపార్థం చేసుకోవచ్చు.

నిజం చెప్పాలంటే కారణాలు—

ఒకటి-మా ఆవిడ ఈనాడు వూరునుంచి వచ్చింది. రెండు- నేను వంటరిగా పెళ్ళికాని ఆడపిల్లల యింటికి భోజనానికి వెళ్ళడం తనకి నచ్చదు. మూడు - తనకి నచ్చనిపని ఏదీ నేను చెయ్యను.

అందుకని విందుకు రానందుకు క్షమార్పణం చెప్పుకుంటూ యీ చిన్న కానుక మా బావమరిది గోపాలం ద్వారా పంపిస్తున్నాను. దయతో స్వీకరించండి.... వెయ్యి కాలాలపాటు సుఖంగా వుండండి. గుడ్ లక్.

— చంద్రం.

ఈ యేటి మేటి సీరియల్ నవలలు
అగ్రశ్రేణి రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి రచనలు..
ఇదీకథ వెల: రూ. 12/-
(ఆనందజ్యోతి సీరియల్)
నింగినుండి నేలకు.. వెల: రూ. 11/-
(వనిత సీరియల్)
అన్ని షాపుల్లోనూ దొరుకుతాయి. లేదా_ 1 రూపాయి తగ్గించి M.O. చేయండి. ఆరూపాయికి V.P. పంపుతాము
డీలక్స్ పబ్లికేషన్స్, ఏలూరు రోడ్, విజయవాడ-2